సాక్షి పల్నాడు

శుక్రవారం। 9। జూన్। 2023



గాలివాన

సత్తెనపల్లి: సత్తెనపల్లిలో గురువారం రాత్రి గాలివాన కురిసింది. దీంతో పలు చోట్ల చెట్లు కూలిపోయి రాకపోకలకు, కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది.



జూలై 2న దుర్గమ్మకు బోనం

విజయవాడ: హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో జూలై 2న ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బంగారు బోనం సమర్పించనున్నారు.



పసుపు కొంటాం

కొల్లిపర: మార్క్‌ఫెడ్ ద్వారా పసుపు కొనుగోలు చేస్తున్నట్లు ఏడీఏ వెంకట్రావు తెలిపారు. గురువారం కొల్లిపరలో ఆయన మార్క్‌ఫెడ్ అధికారులతో కలిసి పసుపు నాణ్యతను పరిశీలించారు.

న్యూస్‌రీల్

మూడు జిల్లాల కార్మిక శాఖ డీసీ బాధ్యతల స్వీకరణ



లక్ష్మీపురం(గుంటూరు): సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల డెప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా పనిచేస్తున్న పి.శ్రీనివాస్‌ను ఏలూరుకు బదిలీ చేస్తూ ఆయన స్థానంలో తెనాలిలో సహాయ కార్మిక కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ధూళిపూడి వెంకట శివ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు గురువారం మూడు జిల్లాల కార్మిక శాఖ డెప్యూటీ కమిషనర్‌గా ధూళిపూడి వెంకట శివప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు తప్పనిసరిగా కార్మికశాఖ కార్యాలయంలో తమపేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులు తప్పనిసరిగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ-శ్రమ్ కార్డు పొందాలని చెప్పారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకు రావల్సిందిగా కోరారు. కార్మికులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు.

ఏపీ మోడల్ ప్రవేశ పరీక్ష కేంద్రం మార్పు

నరసరావుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 12న క్రోసూరులో పర్యటిస్తున్న నేపథ్యంలో ఈనెల 11న ఆదివారం క్రోసూరు ఏపీ మోడల్ స్కూలు కేంద్రంగా నిర్వహించనున్న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశపరీక్షను కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో(కేజీబీవీ)కి మార్చినట్టు కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న 196 మంది విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రవాణా సదుపాయం కల్పించాలని, అలాగే రెండు కేంద్రాల వద్ద విద్యార్థుల సౌకర్యార్థం సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు.


నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,200, గరిష్ట ధర రూ.2,600, మోడల్ ధర రూ.1,700 వరకు పలికింది.

ట్రాక్టర్ ప్రమాద ఘటనలో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: ట్రాక్టర్ ప్రమాద ఘటనకు బాధ్యులైన ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు వట్టిచెరుకూరు ఎస్‌ఐ వి.కలగయ్య తెలిపారు. ఈనెల 5న కొండేపాడు గ్రామస్తులు జూపూడి వెళ్తున్న సమయంలో వట్టిచెరుకూరులో ట్రాక్టర్ బోల్తా పడి ఏడుగురు మహిళలు దుర్మరణం పాలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వట్టిచెరుకూరు పోలీస్ స్టేషన్‌లో 304-ఏ, 304 పార్ట్-2 సెక్షన్ల కింద కేసు నమోదైంది. విచారణ చేపట్టిన గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ యజమాని జొన్నకూటి శామ్యూల్, డ్రైవర్ కె. ప్రశాంత్‌ను గురువారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. న్యాయమూర్తి వీరిద్దరికీ 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ వి.కలగయ్య తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ట్రాక్టర్‌ను నడిపినందుకు డ్రైవర్‌ను, లైసెన్సు లేని వ్యక్తికి ట్రాక్టర్‌ను ఇచ్చినందుకు యజమానిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 520.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.60 అడుగుల వద్ద ఉంది.

జగనన్న గోరుముద్ద సరుకులను తీసుకెళ్లాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలలకు కేటాయించిన ఫోర్టిఫైడ్ బియ్యం, రాగిపిండి, బెల్లాన్ని సంబంధిత రేషన్ దుకాణాల నుంచి తీసుకెళ్లాలని డీఈవో పి.శైలజ శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటలలోపు ఆయా సరుకులను రేషన్ దుకాణాల నుంచి పాఠశాలలకు తీసుకుని వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

• సహజ్ సంక్షేమశీలి





గుంటూరు జిల్లా నంబూరులోని మదరసాలో ఏర్పాటు చేసిన హజ్ యాత్రా కేంద్రాన్ని గురువారం సాయంత్రం సహజ సంక్షేమశీలి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించారు. హజ్ యాత్రికులు, ముస్లిం మత పెద్దలతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

• స్వచ్ఛమేవ జయతే



క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్)లో భాగంగా ఈ-ఆటోలను తన క్యాంపు ఆఫీసు వద్ద గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. వాటి పనితీరును పరిశీలించారు.

ఆశలకు ఝులక్

లాటరీ వలలో విలవిల



- లాటరీలు అంతా మోసం
- అత్యాశకు పోతే నిరాశ, నిస్పృహ తప్పదు
- జిల్లాలో విచ్చలవిడిగా నిషేధిత లాటరీల విక్రయాలు
- గుంటూరు, విజయవాడల నుంచి ఆన్‌లైన్‌లోనే దందా
- రోడ్డున పడుతున్న కుటుంబాలు.. లాటరీ వచ్చినా డబ్బులు రావు
- 15 రోజుల కిందట నకరికల్లుకు చెందిన వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- మామూళ్ల మత్తులో పోలీసు అధికారులు!

ఉదయం నుంచి చంటోడు జ్వరంతో గుక్కపట్టి ఏడుస్తున్నాడు.. మందు బిళ్ల వేద్దామంటే చేతిలో చిల్లిగవ్వ లేదు. ఇంటాయన కోసం ఎదురు చూసిన ఆ ఇల్లాలి కళ్లు నీళ్లయ్యాయి. పగలంతా కండల్లో ఎర్రని మంటలు రలిగ్గి రిక్షా లాగితే.. వచ్చిన కాసులకు లాటరీ నంబర్ తగల్లేదు. ఇది మొదటి సారి కాదు. ఎన్నోసార్లు ఇంటిల్లిపాదినీ పస్తులుంచి కష్టార్జితమంతా లాటరీలకే గుమ్మరించాడు.. ఆశల వలలో చిక్కుకుని నిత్యం మోసపోతూనే ఉన్నాడు.

– ఇలా.. ఎందరో శ్రామికులు లాటరీల మాయాజాలంలో కూరుకుపోయి నష్టపోతున్నారు. కుటుంబాలను కష్టాల కొలిమిలోకి నెడుతున్నారు.

సాక్షి, నరసరావుపేట: నిషేధిత బోడోల్యాండ్, సింగిల్ నంబర్ లాటరీలు పేదల బతుకుల్లో చిచ్చురేపుతున్నాయి. గతంలో ఒకటి రెండు ప్రాంతాలకే పరిమితమై ఈ అక్రమ వ్యాపారం ఆన్‌లైన్ వేదికగా అంతటా విస్తరించింది. నిర్వాహకులు రోజువారీ కార్మికులే లక్ష్యంగా గల్లీకో ఏజెంట్‌ను నియమించుకుని చెలరేగిపోతున్నారు. మన రాష్ట్రంలో లాటరీ టికెట్ల విక్రయాలపై నిషేధం ఉన్నా.. పోలీసులు దీనిపై పెద్దగా దృష్టి సారించడం లేదు. నామమాత్రపు దాడులు, కేసులతో చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా పేద, మధ్య తరగతి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. విజయవాడ, గుంటూరుకు చెందిన ఇద్దరు ప్రధాన సూత్రధారులు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఏజెంట్ల ద్వారా లాటరీ దందాను కొనసాగిస్తున్నట్టు సమాచారం. పోలీసులకు నెలవారీ మామూళ్లు ముట్టజెబుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

ప్రధాన కేంద్రాలే అడ్డాగా...

విజయవాడ, గుంటూరులో ఉన్న నిర్వాహకులు నరసరావుపేట, తెనాలి, చిలకలూరిపేట, మాచర్ల, సత్తెనపల్లి వంటి కేంద్రాలను అడ్డాగా మార్చుకుని లాటరీ తంతు నడుపుతున్నారు. గతంలో ఒక వ్యక్తి వద్ద లాటరీ టికెట్ల అమ్మకాలు జరిగేవి. ఇప్పుడు ఆన్‌లైన్‌లోనూ, వాట్సాప్‌ల ద్వారా లాటరీ టికెట్ అమ్మకాలు సాగుతున్నాయి. బోడోలాండ్ లాటరీ ధరలు రూ.100 నుంచి రూ.1,500 వరకు ఉంటాయి. నల్లనేరం, తంగం, కుమరన్, విష్ణు, లయన్, స్వర్ణలక్ష్మి వంటి పేర్లతో ఏజెంట్లు లాటరీ టికెట్లను అమ్ముతున్నారు.

సందుసందుకో ఏజెంట్

నరసరావుపేటలో సందుసందుకో లాటరీ ఏజెంట్ ఉన్నారు. పట్టణంలో సుమారు వంద మంది వరకు ఈ దందా సాగిస్తున్నట్టు సమాచారం. చిత్రాలయ టాకీస్, పల్నాడు బస్టాండ్, నాగుర్‌వలీ టాకీస్ సెంటర్, కుమ్మరిబజార్, బాబాపేట, బస్టాండ్, కోట సెంటర్ తదితర ప్రాంతాలలో టికెట్ల విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నట్టు తెలుస్తోంది. చిలకలూరిపేట, సత్తెనపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల పట్టణాల్లో నూ జోరుగా అమ్మకాలు జరుగుతున్నట్టు సమాచారం.

చితికిపోతున్న చిన్న బతుకులు

లాటరీ అత్యాశకు పోయి చిన్న బతుకులు చితికిపోతున్నాయి. రోజంతా కష్టపడితే వచ్చే నాలుగు రాళ్లను కార్మికులు, కూలీలు లాటరీలకే తగలేస్తున్నారు. కొందరైతే అప్పులు చేసి మరీ టికెట్లు కొంటున్నారు. నరసరావుపేటలో చాలా కుటుంబాలు లాటరీ దెబ్బకు కుదేలయ్యాయి. దీనిపై పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించి కార్మికుల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

లాటరీ నిర్వాహకులపై ఉక్కుపాదం



పల్నాడు జిల్లాలో ఇప్పటికే లాటరీ నిర్వాహకులపై ఉక్కుపాదం మోపాం. నిత్యం దాడులు చేస్తున్నాం. గతంలో ఇలాంటి కేసుల్లో పట్టుబడిన నిందితులపై నిఘా ఉంచాం. లాటరీ వల్ల పేద, మధ్య తరగతి జీవితాలు ఛిద్రమవుతున్నాయి. అవసరమైతే నిర్వాహకుల పట్టణ బహిష్కరణకు చర్యలు తీసుకుంటాం.

– వై.రవిశంకర్ రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ

లాటరీ తగిలిన ఆనందం ఆవిరి

నకరికల్లుకు చెందిన ఓ వ్యక్తి ఎన్నోఏళ్లుగా లాటరీ టికెట్లు కొంటున్నాడు. ఇప్పటికే రూ.లక్షలు ఖర్చుపెట్టాడు. 20 రోజుల క్రితం రూ.21 లక్షల లాటరీ తగిలింది. ఇక తన బాధలు తీరిపోయాయని సంబరపడ్డాడు. ఆనందంగా నిర్వాహకుల వద్దకు వెళ్తే కొన్ని రోజులు నిరీక్షించాలని చెప్పారు. ఇంకా అత్యాశతో మళ్లీ టికెట్లు కొనడం ప్రారంభించాడు. రోజులు గడిచినా డబ్బులు రాలేదు. అదేమని అడిగితే చంపేస్తామంటూ నిర్వాహకులు బెదిరింపులకు దిగారు. మనస్తాపానికి గురైన బాధితుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

ఆదర్శ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ అవసరం

కలెక్టర్ శివశంకర్



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

నరసరావుపేట: ఆదర్శ గ్రామాల అభివృద్ధికి ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా పరిషత్ సీఈఓ మోహనరావుతో కలిసి సాగీ (సాన్‌సద్ ఆదర్శ గ్రామ యోజన)పై అధికారులతో కలెక్టర్ తొలి సమీక్ష నిర్వహించారు. 35 అంశాల్లో ప్రగతికి ప్రణాళికలు రూపొందించి వందశాతం అమలు చేయాలని సూచించారు. ఎంపీడీఓలు నిత్యం గ్రామాలను పరిశీలించాలని సూచించారు. ఆదర్శ గ్రామాల్లో పనుల తీరుపై పర్యవేక్షించాలని, కార్యదర్శులకు రోజూ మార్గదర్శనం చేయాలని చెప్పారు. ఆదర్శ గ్రామాల అంశంలో అలసత్వం వలదని చెప్పారు.

‘గురు’తర బాధ్యతలు

- విజయవంతంగా బదిలీలు, ఉద్యోగోన్నతులు
- కొత్త పాఠశాలల్లో హెచ్ఎంల బాధ్యతల స్వీకారం
- బుధవారం రాత్రి ఆన్‌లైన్‌లో ఉత్తర్వులు జారీ
- ఒక్కరోజులో 285 మందికి స్థానచలనం
- నేటి నుంచి స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలకు ఉత్తర్వుల జారీ



గుంటూరులో ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్లు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తయింది. లాంగ్ స్టాండింగ్, రిక్వెస్ట్ బదిలీలు కోరుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు పూర్తి చేసిన విద్యాశాఖ బదిలీ, ఉద్యోగోన్నతి ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో పొందుపర్చింది. ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తూ బదిలీల్లో స్థాన చలనం పొందిన ప్రధానోపాధ్యాయులు విద్యాశాఖ ఆదేశాలతో గురువారం ఉదయం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని నూతన పాఠశాలలకు వెళ్లి విధుల్లో చేరారు.

గురువారం ఉదయం హెచ్ఎంలు అందరూ పాఠశాలల్లో చేరాలని ఇచ్చిన ఆదేశాలతో ఎక్కడికక్కడ పాఠశాలల్లో కొత్త హెచ్ఎంలు కొలువు దీరారు. లాంగ్ స్టాండింగ్ విభాగంలో ఐదేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న హెచ్ఎంలకు ప్రస్తుత బదిలీల్లో స్థాన చలనం కలిగింది. అలాగే ఒకే పాఠశాలలో ఎనిమిది విద్యాసంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులు సైతం తప్పనిసరి బదిలీ విధానంలో నూతన పాఠశాలల బాట పట్టారు. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 285 మంది హెచ్ఎంలకు స్థాన చలనం కలిగింది. వీరిలో 243 మంది బదిలీ కాగా, మరో 42 మంది హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి పొందిన వారు ఉన్నారు.

వివిధ కేడర్లలో 3,350 మందికి స్థాన చలనం

బదిలీలు, ఉద్యోగోన్నతుల ద్వారా లాంగ్ స్టాండింగ్ విభాగంలో వివిధ కేడర్ల వారీగా 3,350 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలగనుండగా, రిక్వెస్ట్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు 2,938 మంది ఉన్నారు. హెచ్ఎంలకు బదిలీ, ఉద్యోగోన్నతి ప్రక్రియ పూర్తవగా, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు శుక్రవారం నుంచి బదిలీ, ఉద్యోగోన్నతి ఉత్తర్వులు జారీ కానున్నాయి.

గురువారం రాత్రితో వెబ్ ఆప్షన్లకు ముగిసిన గడువు

బదిలీ కోరుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు గురువారం రాత్రితో గడువు ముగిసింది. శని, ఆదివారాల్లో ఎస్జీటీలకు బదిలీ ఉత్తర్వులు జారీ కానున్నాయి. తదుపరి పాఠశాలలు తెరిచిన రోజున బదిలీ, ఉద్యోగోన్నతి ద్వారా స్థాన చలనం పొందిన ఉపాధ్యాయులందరూ కొత్త బడుల్లో విధుల్లో చేరాల్సి ఉంది.

సూక్ష్మ వ్యవ‘సాయం’

- చిన్న రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు
- 55 శాతం రాయితీతో స్ప్రింక్లర్లు
- జిల్లాలో 1,000 హెక్టార్లు సాగు లక్ష్యంగా అడుగులు
- ఆర్‌బీకేల్లో ప్రారంభమైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



ఫిరంగిపురంలో కనకాంబరం తోటకు ఏర్పాటు చేసిన డ్రిప్

కొరిటిపాడు(గుంటూరు): ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బీకే)ను ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, సాగు పరికరాలు అందిస్తున్నారు. ఇది రైతు ప్రభుత్వమని చాటి చెబుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే సూక్ష్మ సేద్య విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు. దీనికోసం ప్రభుత్వం రాయితీపై పరికరాలను సమకూరుస్తోంది. రైతులకు నచ్చిన కంపెనీ పరికరాలను ఎంచుకునే అవకాశాన్నీ కల్పిస్తోంది. ఈ ఏడాది సూక్ష్మ సేద్య పరికరాల కోసం ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది.

జిల్లాలో లక్ష్యం ఇలా..

2023-24 సంవత్సరానికి జిల్లాలోని 18 మండలాల పరిధిలో 1,000 హెక్టార్లలో సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రైతులకు నచ్చిన కంపెనీల డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను రాయితీపై అందించేందుకు చర్యలు చేపట్టారు. దీనికోసం నాలుగు కంపెనీలతో ఒప్పందం చేసుకున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైంది. అవసరం ఉన్న రైతులు తమ పరిధిలోని ఆర్‌బీకేకు వెళ్లి అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లను కలిసి తమ వివరాలను నమోదు చేయించుకోవాలి.

సబ్సిడీ వివరాలు ఇలా..

సూక్ష్మ సేద్య పథకంలో 5 ఎకరాల లోపు భూమి కలిగిన సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను ఇవ్వనున్నారు. డ్రిప్ యూనిట్ విలువలో 10 శాతం రైతు భరించాల్సి ఉంటుంది. అలాగే 55 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లను మంజూరు చేయనున్నారు. మిగతా 45 శాతం రైతు భరించాల్సి ఉంటుంది.

- 5 నుంచి 10 ఎకరాలు మధ్య భూమి కలిగిన రైతులకు 70 శాతం సబ్సిడీతో డ్రిప్, 45 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్ల పరికరాలను అందజేస్తారు.
- గతంలో సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు తీసుకుని 7 ఏళ్లు పూర్తి చేసుకుని ఉంటే వారు మళ్లీ పొందేందుకు అర్హులు.
- భూమి కలిగిన ప్రతి రైతుకు ఈ సబ్సిడీ పథకం వర్తిస్తుంది.
- అరటి, కూరగాయలు, సపోటా, జామ, పూల తోటలు, పసుపు, ఉల్లి తదితర పంటలకు డ్రిప్, బుడ్డ శనగ, వేరుశనగ తదితర పంటలకు స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం..



తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు పండించేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. 2023-24 సంవత్సరంలో జిల్లాలో 1,000 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికోసం రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ రైతు భరోసా కేంద్రాల్లో ముమ్మరంగా సాగుతోంది. డ్రిప్, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేయించుకోవాలి.

-ఎల్.వజ్రశ్రీ, ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, గుంటూరు జిల్లా

తెనాలి మున్సిపల్ రెండో వైస్ చైర్‌పర్సన్‌గా నాగవేణి



నాగవేణికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి గీతాంజలిశర్మ

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ రెండో వైస్ చైర్‌పర్సన్‌గా 40వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ అత్తోట నాగవేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ ప్రకటించారు. అనంతరం నాగవేణితో ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారి గీతాంజలి శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య 40వ వార్డు కౌన్సిలర్ అత్తోట నాగవేణి పేరును ప్రతిపాదించారు. వెంటనే 31వ వార్డు కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి బలపరిచారు. సభ్యుల నుంచి అభ్యంతరం లేకపోవడంతో నాగవేణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గీతాంజలి శర్మ ప్రకటించారు. అనంతరం నాగవేణితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎక్స్ అఫిషియో సభ్యుని హోదాలో సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ ఎం.జశ్వంతరావు తదితరులు నాగవేణిని సన్మానించారు. అనంతరం మాజీమంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఐతానగర్‌లోని లింగారావు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇదిలా ఉంటే వైస్ చైర్‌పర్సన్ ఎన్నికకు ఎనిమిది మంది టీడీపీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ నాగవేణి ఎన్నిక సామాజిక న్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు. నాగవేణి మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గానికి వైస్ చైర్‌పర్సన్ పదవి ఇవ్వడం హర్షణీయమని చెప్పారు.

వినుకొండ వద్ద రైల్వేగేటు మూసివేత

సీనియర్ డీసీఎం దినేష్ కుమార్

ఆర్‌యూబీ ద్వారా ట్రాఫిక్ మళ్లింపు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుంతకల్ స్టేషన్ మధ్య రైల్వే డబ్లింగ్ లైను పనులు జరుతున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆరుగంటల నుంచి రాత్రి 12 గంటల వరకు వినుకొండ యార్డులో చీకటిగలపాలెం, వినుకొండ స్టేషన్‌ల మధ్య రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్‌ను మూసి వేయడం జరుగుతుందని సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ గురువారం వెల్లడించారు. స్థానికులు, ప్రయాణికులు, వాహనదారులు గమనించి సహకరించాల్సిందిగా కోరారు. రైల్వే లెవల్ క్రాసింగ్ గేటును మూసి వేసినందున అటుగా ప్రయాణించాల్సిన వాహనాలు వినుకొండ టౌన్ నుంచి ఏనుగుపాలెం వరకు 1.కి.మీ సమీప దూరంలో గల ఆర్‌యూబీ ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించడం జరిగిందని తెలియజేశారు.

సమ్మర్ ప్రత్యేక రైళ్లు కేటాయింపు

సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే ప్రయాణికుల కోసం గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా కాచిగూడ-నరసాపూర్-కాచిగూడ మధ్య సమ్మర్ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ గురువారం వెల్లడించారు. కాచిగూడ-నరసాపూర్(07653) ప్రత్యేక రైలు ఈ నెల 8వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నడుస్తుందని తెలిపారు. ఈ రైలు కాచిగూడ స్టేషన్ నుంచి రాత్రి 8.30 గంటలకు బయలు దేరి మరుసటిరోజు ఉదయం 8.35 గంటలకు నరసాపూర్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. నరసాపూర్-కాచిగూడ(07654) ప్రత్యేక రైలు ఈనెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నడుస్తుందని తెలియజేశారు. ఈ రైలు నరసాపూర్ స్టేషన్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 4.50 గంటలకు కాచిగూడ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు మాల్కాజ్‌గిరి, నల్గొండ, మిరియాలగూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకీవీడు, భీమవరం టౌన్, పాలకొల్లు స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. ఈరైలుకు టూ టైర్, త్రీ టైర్ ఏసీ, స్లీపర్ కోచ్‌లతో పాటు జనరల్ కోచ్‌లను కూడా కేటాయించడం జరిగిందని తెలియజేశారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి జగనన్న కృషి

వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షుడు జిలాని

గుంటూరు రూరల్: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి చేసిన ఏకైక ముఖ్య మంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షుడు జిలాని పేర్కొన్నారు. గురువారం పెదపలకలూరులోని మసీదులో ముస్లిం పెద్దలతో సమావేశమయ్యారు. జగనన్న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత మసీదుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారని తెలిపారు. అదేవిధంగా ముజావర్‌లకు నిధులు అందించారని వివరించారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి జగనన్న చేసిన కృషిని వివరించారు. గతంలో చంద్రబాబు ముస్లిం యువకులపై దేశ ద్రోహం కేసులు బనాయించాడని ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాడన్నారు. ఏనాడు చంద్రబాబు ముస్లింలకు చేసింది ఏమీ లేదని, ఎన్నికలు వస్తున్నాయని నేడు ఓట్ల కోసం ప్రజలకు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాడని వివరించారు. వక్ఫ్‌బోర్డ్ సెక్రటరీ సమీవుల్లా పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లు

- పోలీసు అధికారులతో, ఇతరశాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష
- సభావేదిక ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే.


సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 12న క్రోసూరులో పర్యటించనున్న సందర్భంగా సభ ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. పొక్లెయిన్‌లు, డోజర్లతో నేల చదును చేస్తున్నారు. ప్రజలు భారీగా హాజరయ్యేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఏపీ మోడల్ స్కూల్ వద్ద జరుగుతున్న సభా ప్రాంగణం పనులను పోలీసు, ఇతర జిల్లా అధికారులతో కలసి పరిశీలించారు. తగు సూచనలు చేశారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలే కాకుండా చుట్టుప్రక్కల నియోజకవర్గాల నుంచి ప్రజలు సభకు హాజరవుతారని, కావున తగిన విధంగా వాహనాల పార్కింగ్, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకునేందుకు రోడ్డు మార్గాలన్నీ పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం రాక పట్ల క్రోసూరు మండల ప్రజల్లో సందడి నెలకొంది. కార్యక్రమంలో సీఎం వీరాస్వామి, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, పెదకూరపాడు ఎస్‌ఐలు షేక్ మహబూబ్ సుభాని, పాల్, అమీర్, వెంకట్రావు, వివిధ శాఖల డీఈలు, ఏఈలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లకు జిల్లా పోలీసుశాఖ భరోసా

- సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా సెల్‌ఫోన్ గుర్తింపు
- పోగొట్టుకున్న వ్యక్తులు వివరాలతో ఫిర్యాదు చేయాలి
- జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి



నరసరావుపేట: జిల్లా ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లకు పల్నాడు జిల్లా పోలీసులు భరోసా ఇస్తున్నారు. జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీకి ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ టెలికాం మంత్రిత్వశాఖ సహకారంతో సీఇఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్-సీఈఐఆర్.జీఓవీ.ఐఎన్) అనే వెబ్‌సైట్ ద్వారా జిల్లాలో పోయిన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు రికవరీ చేసి ప్రజలకు అందించేందుకు పోలీస్‌శాఖ శ్రీకారం చుట్టింది. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ పనిచేస్తున్నట్లయితే వెబ్‌సైటు ద్వారా 24 గంటల్లో వెతికి పట్టుకోవచ్చని, అదేవిధంగా ఫోన్లో ఉన్న వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా ఫోన్ బ్లాక్ చేయొచ్చునని జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ముందుగా వారికి సంబంధించిన పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తర్వాత వెబ్‌సైట్‌కు లాగిన్ కావాలని, అందులో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్/ స్టోలెన్ అనే లింక్‌పై క్లిక్‌చేసి, సెల్‌ఫోన్ నంబరు, ఐఎంఈఐ నెంబర్, కంపెనీ పేరు, మోడల్, మొబైల్ కొనుగోలుకు సంబంధించిన బిల్లు అప్‌లోడ్ చేయాలన్నారు. దీంతో పాటు మొబైల్ ఫోన్ ఏ రోజున, ఎక్కడ పోయింది, ఏ రాష్ట్రం, ఏ జిల్లా, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారో వివరాలు నమోదు చేయాలన్నారు. చివరిగా వినియోగదారుడి పేరు, చిరునామా, గుర్తింపు కార్డు (ఆధార్, ఓటర్ ఐడీ, పాన్, ఇతర ప్రభుత్వ గుర్తింపు పొందినవి) ఈ-మెయిల్ ఐడీ, ఓటీపీ కోసం మరో సెల్‌ఫోన్ నెంబర్ ఇవ్వాలన్నారు. ఇదంతా పూర్తయిన తరువాత ఒక ఐడీ నెంబర్ వస్తుందని, తద్వారా సంబంధిత ఐడీ ఫోన్ స్టేటస్ తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ సీఈఐఆర్ వ్యవస్థ ద్వారా పోయిన ఏ కంపెనీ మొబైల్ అయినా 24 గంటల్లోపు ఫోన్ పని చేయకుండా చేయవచ్చునని వెల్లడించారు. సెల్‌ఫోన్ దొరికిన తర్వాత వినియోగదారుడు అదే వెబ్‌సైట్‌లోకి వెళ్లి అన్‌లాక్/ఫౌండ్ మొబైల్ అనే లింక్‌పై క్లిక్‌చేసి, ఐడీ నమోదు చేయగానే ఫోన్ అన్ అయి బ్లాక్ అవుతుందని ఎస్పీ వెల్లడించారు. సెల్‌ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరికీ సీఐఈఆర్ గురించి తెలిసేలా పోలీస్‌స్టేషన్, సర్కిల్, డివిజన్ పరిధిలలో పోలీస్ అధికారులు, సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మొబైల్ పోయిన వెంటనే తమ పరిధిలోని పోలీసులకు సమాచారం అందించి సీఈఐఆర్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.

పోలీసులకు టోపీలు, కళ్లజోళ్లు పంపిణీ

పిడుగురాళ్ల: నిరంతరం విధులు నిర్వహించటమే పోలీస్ విధి అని గురజాల డీఎస్పీ పల్లపు రాజు తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం పోలీస్ సిబ్బందికి క్యాప్‌లు, కళ్లజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గురజాల డీఎస్పీ పల్లపు రాజు మాట్లాడుతూ పోలీసులు ఎండనక, వాననక అహర్నిశలు విధులు నిర్వహిస్తూనే ఉంటారు. ఈ వేసవిలో వడగాలులు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ట్రాఫిక్‌లో, బయట విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ఎండ దెబ్బ తగలకుండా ఉండేందుకు టోపీలు, కళ్లజోళ్లను అందించటం జరిగిందన్నారు. ఈ టోపీలు, కళ్లజోళ్లను పట్టణంలోని డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలు అందించడం అభినందనీయమన్నారు. ఈ వేసవిలో ఎండ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పోలీస్ సిబ్బంది పాటించాలని ఈ సందర్భంగా తెలిపారు. డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు మాట్లాడుతూ పోలీస్ శాఖకు తమ వంతుగా సహాయ, సహకారాలు ఎప్పుడూ అందించేందుకు ముందుంటామని తెలిపారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో 75 మంది పోలీస్ సిబ్బందికి టోపీలు, కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఎస్‌ఐలు పఠాన్ రబ్బానీ ఖాన్, పవన్‌కుమార్, అంజిరెడ్డి హాస్పటల్ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీస్ సిబ్బందికి టోపీలు, కళ్లజోళ్లను అందజేస్తున్న డీఎస్పీ పల్లపు రాజు, డాక్టర్ నాగమల్లికార్జునరావు

పశుపోషణలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

చినగంజాం: పశుపోషణలో యాజమాన్య పద్ధతులు విధిగా పాటించడం ద్వారా పశు పోషకులకు లబ్ధి చేకూరుతుందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మద్దు హనుమంతరావు పేర్కొన్నారు. గురువారం చింతగుంపల్లిలో పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పశు బీమా పథకం, పశుగ్రాస విత్తనాలు, మేలైన పశు యాజమాన్యం, దూడల పెంపకం గురించి వివరించారు. శిబిరంలో 12 పశువులకు సాధారణ చికిత్స, 31 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 67 పశువులకు నట్టల నివారణ మందు వేశారు. చీరాల పశు వైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ సజ్జా చిట్టిబాబు, సంతరావూరు, చినగంజాం పశువైద్యాధికారులు టీ శివారెడ్డి, బీ కిరణ్‌కుమార్ ఉన్నారు.

గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ట శాంతికి దోహదం

ప్రభుత్వవిప్ పీఆర్కే

మాచర్లరూరల్: గ్రామ దేవత పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ప్రజలంతా ఐక్యంగా నిర్మించుకోవటం గ్రామానికి శాంతి సౌభాగ్యాలకు నెలవుగా ఉంటుందని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గన్నవరం గ్రామంలో పోలేరమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామ ప్రజలంతా భక్తి శ్రద్ధలతో పోలేరమ్మ గుడి నిర్మాణాన్ని పూర్తి చేసుకొని అత్యంత వైభవంగా నిర్వహించుకోవటం ఆనందకరమన్నారు. గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్టత వలన గ్రామంలో ఐక్యత, శాంతి సౌభాగ్యాలకు నిలయంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నెల్లి వెంకటేశ్వరరెడ్డి, రాములమ్మ, పిన్నెల్లి రామిరెడ్డి, రామ్మోహనరెడ్డి, మున్నా పాపయ్య, దొడ్డా నర్సిరెడ్డి, కందుల శివారెడ్డి, గొలమారి మట్టారెడ్డి, రామకృష్ణారెడ్డి, వేముల కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులున్నారు.


పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని పూజ నిర్వహిస్తున్న పీఆర్కే, పీవీఆర్

నిబంధనల ప్రకారమే ఆస్పత్రులు నిర్వహించుకోవాలి

జిల్లా వైద్య బృందం

చీరాల రూరల్: పట్టణంలోని అన్ని వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లు నిబంధనల ప్రకారం పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారుల బృందం గురువారం పట్టణంలోని పలు వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లను పరిశీలించారు. శంకర్ ల్యాప్రోస్కోపి అండ్ ఇన్‌ఫెర్టిలిటీ సెంటర్ నందు రెండు స్కానింగ్ మిషన్లను, ప్రేమ హాస్పిటల్‌లో స్కానింగ్ మిషన్‌ను పరిశీలించారు. ఆయా పరికరాలను అధికారికంగా రిజిస్టర్ చేయించుకుని ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తున్నట్లు గుర్తించామని డీఎంహెచ్‌వో తెలిపారు. హాస్పిటళ్లలో అందిస్తున్న సేవలను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. డీఎంహెచ్‌వో వెంట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్య బృందం

14 ఎకరాల గడ్డివాములు దగ్ధం

క్రోసూరు: క్రోసూరులో గురువారం బాణసంచా కాల్చిన సందర్భంగా నిప్పురవ్వలు పడి రోడ్డు పక్కనే గల 14 ఎకరాల గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. ఎస్‌ఐ షేక్ మహబూబ్ సుభాని తెలిపిన వివరాల మేరకు.. క్రోసూరు కొండ బజారుకు చెందిన ఐదుగురు రైతులకు గడ్డివాములు ఏర్పాటుచేశారు. క్రోసూరు కొండ కింద బజారుకు చెందిన ఆది అంకమ్మరావు మృతి చెందగా మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతూ గ్రామశివారులో టపాసులు కాల్చారు. రవ్వలు గడ్డివాములపై పడి 14 ఎకరాల గడ్డివాములు తగలబడి పోయాయి. బాధితులు ములుగూరి శ్రీనివాసరావుకు చెందిన మూడెకరాల గడ్డివామి, ములుగూరి వెంకట్రావుకు చెందిన రెండు ఎకరాల గడ్డివామి, ములుగూరి రాము రెండెకరాలు, ములుగూరి అశోక్ మూడెకరాలు, గట్టి శ్రీనివాసరావు నాలుగు ఎకరాలు మొత్తం 14 ఎకరాలు తగులబడినట్లు ఎస్‌ఐ వివరించారు.


దగ్ధమవుతున్న గడ్డివాములు

అదుపుతప్పి కారు బోల్తా

ఆరుగురికి గాయాలు

దాచేపల్లి: అతివేగంతో వస్తున్న కారు అదుపుతప్పి పల్టీ కొట్టిన సంఘటన దాచేపల్లి సమీపంలో గురువారం జరిగింది. ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా కారు అదుపు తప్పటంతో అందులో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుంచాల సురేష్ ఒంగోలు నుంచి తన కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌కు కారులో వెళుతున్నాడు. దాచేపల్లి సమీపంలో కారు అదుపు తప్పటంతో డివైడర్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న కరెంట్ స్తంభాన్ని కూడా ఢీకొట్టింది. దీంతో కారు పల్టీ కొట్టటంతో అందులో ఉన్న కుంచాల సురేష్, కుంచాల నాగమణి, కుంచాల పద్మావతి, కుంచాల హనుమంతరావుతో పాటుగా మరో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. కారులో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావటంతో పెనుప్రమాదం తప్పింది. సంఘటన స్థలానికి సీఐ షేక్ బిలాలుద్దీన్, ఎస్‌ఐ దాసరి శివనాగరాజు చేరుకుని క్షతగాత్రులను వైద్యం కోసం అంబులెన్స్ ద్వారా పిడుగురాళ్లలోని హాస్పిటల్‌కు తరలించారు.


సంఘటన స్థలంలో క్షతగాత్రులు

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

పీడీ శంకర్‌నాయక్

కారంచేడు: ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ వై శంకర్‌నాయక్ పేర్కొన్నారు. కారంచేడు మండలంలో 2023-24 సంవత్సరాలకుగాను రూ.6.8 కోట్ల నిధులతో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టినట్లు మెప్మా పీడీ తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రం కారంచేడు పరిధిలో చీరాల-కారంచేడు మార్గంలో చేస్తున్న పంట కాలువల అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ ఏడాది మండలంలో 2.94 లక్షల పనిదినాలు ఉండేలా లక్ష్యంగా సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. వీటిలో ఇప్పటికే 1.48 లక్షల పనిదినాలు పూర్తి చేయడంతో సిబ్బందిని పీడీ అభినందించారు. కారంచేడు చర్చి రోడ్డు వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన నీడ కోసం టెంట్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రోజుకు రూ 272 వేతనం అందేలా పనిచేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన పనిని, కొలతల ప్రకారం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో డీ విజయలక్ష్మి, ఏపీఓ ప్రదీప్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.


పంట కాలువల పనులు పరిశీలిస్తున్న పీడీ, ఎంపీడీవోలు

క్రీడా శిక్షణ శిబిరాలతో మారుతోన్న కెరీర్

సెప్ట్ సీఈఓ పల్లవి

గుంటూరువెస్ట్: దేశంలో పేరొందిన క్రీడాకారులు ముందుగా శిక్షణ శిబిరాలతోనే తమ కెరీర్‌ను ప్రారంభించారని సెప్ట్ సీఈఓ ఎస్.పల్లవి తెలిపారు. నెలరోజులుగా స్థానిక బీఆర్ స్టేడియంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరాలు గురువారంతో ముగిశాయి. పల్లవి మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ తీసుకున్న చిన్నారులు భవిష్యత్‌లో కూడా తమ సాధన కొనసాగించాలన్నారు. దీనికి తల్లిదండ్రుల పాత్ర ఉందని అన్నారు.

బాల్య వివాహాలు సమాజానికి చేటు

గుంటూరువెస్ట్: ముక్కుపచ్చలారని చిన్నారులకు సాంప్రదాయాల పేరుతో బరువు, బాధ్యతలను దించుకోవాలనే సాకుతో బాల్య వివాహాలు చేస్తున్నారని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఆదిలక్ష్మి, పద్మావతి పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కైలాస సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, సౌజన్యంతో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్లానింగ్ అండ్ కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఆదిలక్ష్మి, పద్మావతిలు మాట్లాడుతూ ముఖ్యంగా కుగ్రామాల్లోనూ, పేద కుటుంబాల్లోను బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.

యువకుడిపై హత్యాయత్నం



కర్లపాలెం: ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగిన సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, కర్లపాలెం ఏఎస్‌ఐ సాంబశివరావు తెలిపిన వివరాల మేరకు రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన తాతపూడి యోహాను మాంసం విక్రయిస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన వంగివరపు ఏసురత్నంతో పాటు తాతపూడి ఏసురత్నంలు తన తమ్ముడైన యోహాను వద్ద పనిచేస్తుంటారు. వ్యాపారానికి సంబంధించిన నగదు ఎక్కువగా వాడుకుంటున్నాడని, సరిగా ఇవ్వటం లేదని తాతపూడి ఏసురత్నంను అతని తమ్ముడు యోహాను ఇటీవల పని నుంచి తొలగించాడు. వంగివరపు ఏసురత్నం తనపై చాడీలు చెప్పటం వలనే తమ్ముడు యోహాను తనను పని నుంచి తొలగించాడని తాతపూడి ఏసురత్నం మనసులో పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం తాతపూడి ఏసురత్నం వంగివరపు ఏసురత్నంతో గొడవపడి కత్తితో మెడపై పొడిచి పారిపోయాడు. తీవ్ర రక్తస్రావమైన వంగివరపు ఏసురత్నంను స్థానికులు వైద్యం కోసం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ముద్దాయి తాతపూడి ఏసురత్నం 2009లో తన భార్యను చంపిన కేసులో ముద్దాయిగా పది సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడని తెలిపారు. ఈఘటనపై కేసు నమోదు చేసి ముద్దాయి తాతపూడి ఏసురత్నంను అదుపులోకి తీసుకుని, దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ వెంకటేశ్వర్లు, కర్లపాలెం ఏఎస్‌ఐ సాంబశివరావు తెలిపారు.

బాలిక అనుమానాస్పద మృతి

నాదెండ్ల: బాలిక అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటనపై నరసరావుపేట డీఎస్పీ మహేష్, రూరల్ సీఐ వై అచ్చయ్య, ఎస్సై ఎ.భాస్కర్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. స్థానికుల కథనం ప్రకారం... నాదెండ్ల అంబేద్కర్ కాలనీకి చెందిన ఆరో తరగతి పూర్తయిన పన్నెండేళ్ల బాలిక బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందింది. మృతురాలి తల్లి, అక్క బుధవారం పొలం పనులకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని కనిపించింది. 108 సాయంతో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు చెప్పటంతో మార్చురీలో మృతదేహాన్ని ఉంచారు. గురువారం ఉదయం నరసరావుపేట డీఎస్పీ మహేష్, స్థానిక పోలీసు అధికారులతో మృతురాలి ఇంటిని పరిశీలించారు. బాలిక మృతి చెందిన సమయంలో ఇంటి బయట గడియ పెట్టి ఉండటం, ఫ్యాను తక్కువ ఎత్తులో ఉండటం వలన చున్నీ ఫ్యానుకు తగిలి మరణించి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాలిక తండ్రి రెండేళ్ల కిందట కరోనాతో మృతిచెందాడు. మృతురాలు నాదెండ్ల కేజీబీవీలో ఆరో తరగతి పూర్తి చేయగా, ఈ ఏడాది ఏడో తరగతిలో చేరాల్సి ఉంది.